కథ

ప్రాణసఖి

– కె.సంగీత

"వరూ

ఎలావున్నావ్? ఏమిటీ ఉత్తరమే రాయడం మానేశావ్! అంతమొహంమొత్తానానేను? మోహావేశాల పందిరిలో ఎన్ని రాత్రింబవళ్ళు మనం కలుసుకోలేదు? కలిసి వుండలేదు? చెట్టాపట్టావేసుకు తిరిగి చివరకు చెరో ఇంటికీ వెళ్ళాలంటే ఎంత ఇరకాటంగా వుండేది మన కి? అప్పుడే అన్నీ మరచిపోయావా? నన్నువలచింది నువ్వేనా అని అనుమానం వస్తోందిప్పుడు. వెంటనే ఉత్తరం రాయకపోతే వెనువెంటనే నేను రావాల్సి వస్తుంది. అది నీకిష్టమైతే రాయకు.

సదానీ
మను"

ఆఉత్తరాన్ని కనీసం పదిసార్లు చదువుకుని వుంటుంది వరూధిని. మనూకి ఉత్తరం రాయాలి. తప్పదు. రాయకపోతే వచ్చినా వస్తాడు. మొండిమనిషి.

మను, తను కలం స్నేహితులు. ఇద్దరి మధ్యా వర ద గోదావరిలా పొంగి ప్రవహించిన ఉత్తరాలు... తనకు మను రాసినవి; తను మనుకు రాసిన ఉత్తరాల నకళ్ళు చేతిలోకి తీసుకుంది వరూధిని. ఆమెకళ్ళు ఒక్కో ఉత్తరం వొళ్ళోనూ తెరచుకుంటున్నాయి.

మొదటి ఉత్తరం - అందులో నిజంగా ఏ ప్రాముఖ్యతా లేదు. ఒకే పత్రికలో ఒకే సంచికలో తను, మను ఇద్దరి చిరునామాలు, అభిరుచులు,చదువు సంధ్యలు, ఇతర వ్యాపకాలు ప్రచురితమయ్యాయి. 'మను' అనే పేరు, అభిరుచులు ఇవన్నీ తనకు నచ్చడంతో ఉత్తరం రాద్దామనుకుంది. స్త్రీ సహజమైన సిగ్గు సంకోచాలతో కొంచెంతటపటాయించి అపని చేయలే కపోయింది. పురుషసహజమైన చొరవ, చొచ్చుకుపోయే తనంతో అతనాపనిచే శాడు. ఉత్తరంలో అంతర్లీనంగా ఎంతో భావుకత, తన పట్ల సుముఖత వేసవిలో మల్లెపందిరి విరగబూసినట్లు పరుచుకుంది. ఆ ఉత్తరానికి బదులు రాస్తూ అసలు తనేముందు రాద్దామనుకున్నానని రాసింది. అంతే! రెచ్చిపోయాడు మను.

"నువ్వు నాకోసమే పుట్టావంటే నవ్వుతావేమో- నువ్వులేకుంటే, రాయకుంటే,రాకుంటే నేను అసలు లేను. ప్రేమ - యుద్ధం లాంటిది; మొదలెట్టడం సులువు. ఆపడం మహాకష్టం. అదెంత కష్టమైనా ఇద్దరం పడదాం. ఏమంటావ్!?"

ఏమంటాను!? అవునని కానీ, కాదని కానీ, అనలేకపోయాను. మీ ఉత్తరానికి బదులు రాయకుండా వుండ లేకపోయాను. దానికి వెంటనే బదులొచ్చింది అనుకుంటూ మరో ఉత్తరం తెరచింది వరూధిని.

"ప్రేమలో చావూబతుకూ సర్వం ఒక్కటే. నీ కోసం చావగల్గినపుడు నీ కోసం ఎందుకు బతకలేను? నీ సుతిమెత్తని చేతుల్లో ఏకత్తీ లేకపోయినా సూదంటు రాయికన్నా చురుక్కుమనిపించే నీ చూపుకు ప్రాణం యివ్వకుండా ఎలావుండను? నువ్వు పూబాలవై నిన్న రాత్రి నా తోటలో షికారొచ్చావు. సంపెగలు, సన్నజాజులు పొగడ, మాలతి - ఏవీ నాకు కనిపించలేదు. అన్నీ నువ్వే అయి కనిపించావు. కలలోసరే - నిజంగా ఎప్పుడొస్తావ్, చెప్పు

- నీ మను"

ఉత్తరంతో బాటు మను తన ఫోటోలు, తను వేసిన పెయింటింగ్స్ పంపాడు. తన ఫోటో, తను వేసిన బొమ్మలు పంపుతూ ఇలా రాసింది వరూధిని.

"మనూ!

మనుషులు చూసుకోకుండా మన మధ్య ఇంత ప్రేమ ఎలా పుట్టిందో అర్థంకావడం లేదు. నీ పెయింటింగ్స్ నీ రచనలకన్నా బావున్నాయి. నీ ఫొటోలు నేనూహించిన దానికన్నా గొప్పగా వున్నాయి. వరద వచ్చినపుడు తీరం దాటకుండా నదిని, వలపు పుట్టినప్పుడు ఇంటి గడపదాటకుండా ఆడదాన్ని ఎవ్వరూ ఆపలేరు. ఎప్పుడో వచ్చేస్తాను. వచ్చేముందు రాస్తాను. నిన్నేవరించిన వరూధిని"

"వరూ!

వలపంతా వడ్డించి పంపిన ప్రేమ విస్తరి అందుకున్నా. నిన్నే అందుకున్నంత సంబరపడ్డా. వలపు అనే మాటలోనే 'వల' వుందేమో! నీ గురించి కలకందామంటే నిదురరాదు. కళ్ళు తెరిచున్నాయి కదా పోనీ అని నువ్వు రావు. కలకీ నిజానికీ మధ్య బతకడం నిజంగా కష్టంగా వుంది. ఈ గ్రీష్మఋతువులో నిన్న ఇక్కడ వర్షం. నాపాలిట అది ఎన్ని జ్వాలలు రేపిందో తెలుసా!? నీ కోసం చూసి చూసి, రాలేదని ఏడ్చి ఏడ్చి కన్నీరు కరిగిపోయింది. గుండెలో రాజుకున్న అగ్ని మాత్రం ఆరలేదు. బయటా వర్షమే. లోపలా వర్షమే. అయినా ఎందుకో నన్ను దహించే ఈ మంటలు!? ఈ మంటల్లో నేను కాలిపోతూ వుంటే, వచ్చే జ్వాలలోని మసిని నువ్వు కాటుకగా పెట్టుకుందువుగాని! అప్పుడు స్వచ్ఛమైన నా ప్రేమ ఎలాంటిదో నిజంగా నువు చూడగలవు.

-మను"

"మనూ!

నా హృదయ ఏకాంతంలో నేనుండలేని స్థితికి వచ్చాను. మాటగా మారే ప్రయత్నంలోనే నా ఆలోచనలు సగం చచ్చిపోతున్నాయి. వచ్చేస్తాను. కొంచెం ఓపిక పట్టు - వరు!"

ఉత్తరమైతే రాసింది కానీ కదల్లేకపోయింది వరూధిని. అందుకు రెండు కారణాలు. అమ్మా నాన్నా బావతో తన పెళ్ళికి తొందర చేయడం, బావ తననే వెదుక్కుంటూ రావడం. బావ వస్తే తనకు చాలా ఇబ్బంది. ఊపిరి సలుపుకోనివ్వడు. క్షణం వదిలి పెట్టడు. ఎప్పుడూ కళ్ళ ముందే వుండాలంటాడు. తనుండకపోతే అతనుంటాడు. అతి కష్టం మీద బావ నొక్కడ్నీ సినిమాకు పంపి అమ్మతో చెప్పింది-" నేనోసారి కొడైకానాల్ వెళ్ళిరావాలి. వచ్చింతర్వాతగానీ పెళ్ళి గురించి నా నిర్ణయం చెప్పలేను"

"అదేమిటే బావను చేసుకోవా!?"

"ప్లీజ్, నాక్కొంచెం టైమియ్యి అమ్మా . అన్నీ చెప్తాను"

"మరి బావుండగా కొడైకానల్ ఎలా వెళ్తావ్, బావుండదేమో!"

"బావుండగా వెళ్ళనులే. ఏదో సాకు చెప్పి అతన్ని ఊరికి పంపు" మరో మాటకు అస్కారం ఇవ్వకుండా తన గదిలోకెళ్ళి తలుపు మూసుకుంది వరూధిని.

నెలరోజులు వుండామని వచ్చిన బావ అతి కష్టం మీద వారం పది రోజులక్కానీ కదల్లేదు. ఈలోగా మను వద్దనుంచీ మూడు ఉత్తరాలు - "నాతోటలో ఎన్ని చెట్లు న్నాయో!? చెట్టు గా వుంటే ఏడాదికో వసంతం దక్కేది. మనిషినై ఒక్క వసం తానికీ నోచుకోలేదు. నా పిడికిలి అంత గుండెకు ఎంత ప్రేమ కావాలి? అదీ కరువే! అసలు మన జీవితాలు ఇంత దుర్భరంగా వుండటానికి కారణం ద్వేషం కాదు. ప్రేమ లేకపోవడం, ప్రేమించ లేకపోవడం. మ్రొక్కెద నీ పాదములకు గ్రుక్కున కరుణించవే."

వెంటనే సమాధానం రాసింది వరూధిని -"కోపము సేయకురా. కోరి వున్నానురా, వలపు నిలుపలేవా. వలచి నిను - ఉన్నానురా." వెను వెంటనే బదులు రాశాడు మను.

"నా కళ్ళు నీకోసం నిరీక్షించే వాకిళ్ళు. నిలువెత్తు నీ అందానికి నిలువుటద్దాలు. అరవిచ్చిన సంపెంగ సిగ్గుపడేను. నీ పచ్చని మేను చూసి పొగడపూలతో దండలు కట్టి నీ వొంటి మీద మరో నూలు పోగులేకుండా వాటినే కట్ట బెడతాను. దాంతో ధన్యమవుతుంది ఆపొగడపూల జన్మ!" అంటూ కవిత్వ ధోరణిలో ఏవేవో రాశాడు. తనంటే ఎంతటి ఆరాధన!

మరో ఉత్తరం చదివి ఉక్కిరి బిక్కిరైపోయి దిక్కు తోచలేదు వరూధినికి. మూడో ఉత్తరం -తను ముందుగా

చదువుకున్న ఉత్తరం, తను రాకపోతే అతనే వచ్చేస్తానని రాసిన ఉత్తరం సరిగ్గా బావ వూరు వెళ్ళే రోజే అందింది. ఆమర్నాడే బయలుదేరింది కొడైకానల్‌కి.

* * * * *

కొడైకానల్ నుంచి వారం రోజుల తర్వాత వచ్చింది వరూధిని. వచ్చిన వెంటనే చెప్పింది తల్లితో - మీరు చెప్పినట్లే బావను పెళ్ళి చేసుకుంటాను - ముహూర్తం పెట్టించండని. ఆ మాట కోసమే నిరీక్షిస్తున్న వరూధిని తల్లి మరి ఆలస్యం చేయలేదు. బావ సన్యాసి రావుతో వరూధిని పెళ్ళయిపోయింది. పెళ్ళయి పదహారోజుల పండగెళ్ళాకా బావతో, బావ వూరు కాపరానికి కూడా వెళ్ళిపోయింది వరూధిని.

బావ పేరు సన్యాసిరావే కానీ నిజంగా సన్యాసి కాడు; సజావైన సంసారే. వరూధిన్ని కంటికి రెప్పలా కాకపోయినా, ఇంటికి ఇల్లాలుగా బాగా చూసుకుంటున్నాడు.

కొత్త కాపురంలో సెటిలయి, బిజినెస్ మేగ్నెట్‌గా వున్న భర్త సన్యాసిరావు అతని పనులతో బిజీగా వున్నప్పుడు - అప్పుడు రాసింది ఉత్తరం వరూధిని మనుకి. తిరుగు టపాలో ఉత్తరం రాసాడు మను. వారిద్దరి మధ్య ప్రేమ కోత కొస్తోంది. పల్లవి మాత్రమే పాడుకున్న ప్రేమ సరి కొత్త చరణాలై సాగుతోంది. రేఖాచిత్రంగా మొదలైన ప్రేమ తైల వర్ణచిత్రమై విచిత్రంగా వెల్లి విరుస్తోంది. అది మరుని వింటి విరి, గంగా ఝరి.

సాయంకాలం బైట నుంచి వచ్చిన సన్యాసి రావుకు సాదరంగా ఓ 'వెల్ కమ్ స్మైల్' ఇచ్చి, చదువుతున్న పుస్తకం టీపాయ్ మీద పెట్టి, కాఫీ తేవడానికి కిచెన్‌లో కెళ్ళింది వరూధిని. సోఫాలో కూలబడి వరూధిని మూసిన పుస్తకం తెరిచాడు సన్యాసి రావు. అది చలం 'స్త్రీ'. ఆ రచయిత ఎంత గొప్పవాడో, అందులో ఏం రాసుందో సన్యాసి రావుకు తెలీదు. పేజీలు తిరగేస్తుంటే ఓ ఉత్తరం కనిపించింది. అది మను వరూధినికి రాసినది. మను పేరు చూడగానే మనసు భగ్గు మంది. పెళ్ళికి ముందు వరూధిని వీడ్నే ప్రేమించిందని తెలుసు. వాడు పెళ్ళి తర్వాత కూడా టీవీ సీరియల్‌లా కొనసాగుతున్నాడని తెలీదు. ఉత్తరంతో బాటు బాత్రూం లో కెళ్ళి తలుపు మూసుకున్నాడు సన్యాసి రావు.

"వరూ!

నాకు బాధ రుచి తెలిసిందని నన్ను భాధించడం మానేస్తావా? సంతోషం నాకు ఎలా దక్కుతుంది- మెదడు నిండా పూల తోటలు, మదిలో ఎడారి. మెదడుకు, మదికి పెద్ద దూరం లేదు - మధ్యలో పెద్ద అగాధం. ప్రేమ నానెత్తి మీద కిరీటం పెట్టిందనుకున్నాను. శిలువపైకి ఎక్కిస్తోందని ఇప్పుడర్థం అవుతోంది. ఓసారి నిన్ను చూడాలని వుంది. రాగలవా!? లోకానికి శోకానికి వెరవనిదే ప్రేమ; నాకానికి నరకానికి అందనిదే ప్రేమ. నేను రాలేను. వీలు చూసుకుని నువ్వేరా. రావాలి.

నీ మను"

వొళ్ళు మండిపోయింది సన్యాసి రావుకి, ఉత్తరం మీద ఎడ్రస్సుందేమోనని చూశాడు. కనబళ్ళేదు. ఎడ్రస్సు లేని వెధవ - అనుకుంటూ ఉత్తరం జేబులో కుక్కుకుని, మొహం కడుక్కుని బైటకొచ్చాడు.

"నీ కోసం కాఫీ తెద్దామని వెడితే బాత్రూమ్‌లో దూరావేంటి బావా, వేడి చేసి తీసుకురానా!?" అంది వరూధిని.

"ఎందుకు శ్రమ! ఇలాయివ్వు తాగేస్తా" ఒక్క శాతం కూడా తన మనోభావాలు బైట పడ నివ్వలేదు సన్యాసి రావు. వ్యాపారస్థుడికి ఆవేశం పనికిరాదు- అదీ వ్యాపారంలో అతడు నేర్చుకున్న మొదటి పాఠం.

* * * * *

"సీరియస్. స్టార్ట్ ఇమ్మీడియట్లి-మను" అనే టెలిగ్రాం అందుకుని నిలువెల్లా కంపించి పోయింది వరూధిని. సూట్‌కేసు సర్దుకుంటూ వుండగా వచ్చాడు సన్యాసిరావు. అతనూ వస్తానన్నాడు. అవునని కానీ కాదని కానీ చెప్పే స్థితిలో లేదు వరూధిని. ఇద్దరూ బైలుదేరారు.

"సీరియస్‌గా వున్నాట్ట. చస్తే బావుణ్ణు వెధవ - పీడా పోతుంది. వీళ్ళ వ్యవహారం లోతెంతో తెల్సుకుంటే అమీ తుమీ తేల్చుకోవచ్చు" అని కూడా అనుకున్నాడు సన్యాసిరావు. శోకదేవతలా వున్న వరూధిని ఆలోచనలన్నీ వేరేగా వున్నాయి.

మొదటిసారి తను కొడైకి వెళ్ళినప్పటి సంగతులు జ్ఞాపకం వస్తున్నాయి...

కొడైలో ఘను ఎడ్రస్సు పట్టుకోవడం కష్టం కాలేదు వరూధినికి. మనుని పట్టుకోవడమే కష్టమైపోయింది. మూడు ఎకరాల స్థలంలో ముచ్చటగా చుట్టూ పూలతోట, ఫల వృక్షాలు, తూగుటుయ్యాల, జారుడు బండ, ఈత కొలను - వాటి మధ్య వాటి కోసమే పుట్టినట్టున్న బంగళా. వరూధిని వెళ్ళే సరికి కళ్యాణి రాగం వీణ మీద వినిపిస్తోంది. ఆరాగమంటే తనకు మనుకూ ప్రాణం. మనూయే అలా స్వాగతం చెబుతున్నాడను కుంది. మను కాదు - ఎవరో ముసలాయన! ఆయన్ని డిస్టర్బ్ చేయడం ఇష్టం లేకపోయింది. 'కళ్యాణి'ని కావలించుకున్న ఆయన కూడా అంత తొందరగా డిస్టర్బ్ అయ్యేట్టు లేడు. చుట్టూ కలయజూసింది. హాలునిండా మను ఫోటోలు - రాగాలాపన చేస్తున్నవి, సితార్ వాయిస్తున్నవి, పెయింటింగ్ చేస్తున్నవి, టెన్నిస్ రాకెట్‌తో నిలబడినవి ఇలా ఎన్నో. హాలు నిండా వాద్యపరికరాలు, టాగోర్ కవిత్వం, షేక్స్‌పియర్ నాటకాలు, వాల్ట్ విట్‌మన్ పొయిట్రీ, ఖలీల్ జిబ్రాన్ ప్రొఫెట్, చలం సాహిత్యం- ఎన్నో మంచి మంచి పుస్తకాలు. భుజం మీద చేయిపడేసరికి ఉలిక్కిపడింది వరూధిని. ఎదురుగా ముసలాయన! ఓ క్షణం ఏం మాట్లాడాలో తెలీలేదామెకు. ఆమెనా ఇబ్బంది నుంచి బైట పడేస్తూ "అరే! వరూధిని" అన్నాడాయన. నివ్వెర పోయిందామె. "బమ్మెరపోతన కవిత్వం పోత పోసినట్టు న్నావ్, నివ్వెరపోతావేంటి, నీ గురించి నాకు మొత్తం తెలుసు. మను నా మనవడు. వాడికీ నాకూదాపరి కాల్లేవు. ఇలారా చెప్తాను" అంటూ మేడ మీద మను గదికి తీసుకువెళ్ళాడు. దాన్నిండా తన బొమ్మలే." ప్రేమనీ, దగ్గు నీ దాచుకోలేం. కూర్చో. కాఫీ తెస్తాను" అనేసి అయిదు నిమిషాల్లో బిస్కట్లు, కాఫీ తీసుకొచ్చా డాయన. ఈలోగా ఆగదంతా కలయ జూసింది. ప్రతి అంగుళం అతని మంచి అభిరుచికి అద్దం పడుతోంది. "నువ్వు వస్తున్నావని తెలీదేమో నిన్ననే కలకత్తావెళ్ళాడు - పండిట్ రవిశంకర్, మాండొలిన్ శ్రీనివాస్ జుగల్ బందీ వుందన్నాడు. రెండు మూడు రోజుల్లో వచ్చేస్తాడు. వచ్చేదాకా నువ్వు వెళ్ళడానికి వీల్లేదు." ఏమిటీ మను! నన్నిక్కడ బందీ చేసి జుగల్ బందీకి వెళ్ళిపోయాడు!?

మనుకోసం ఎదురుచూస్తూ నాలుగైదు రోజులుండి పోయింది తను. ముసలాయన చాలా బాగా చూసుకున్నాడు. ఆయన పేరు కూడా మనూయేనట. తాతగారి పేరే మనుకు పెట్టారన్నమాట. ఓ రాత్రి మాల్ కోస్‌లో ఓ పాట తనను కుదిపేసింది. హాల్లో కెడితే ముసలాయన! ముసలితనం మనిషికే గానీ గొంతుకు లేదు. తనకిష్టమైన తలత్‌మహమద్ గొంతులోని ఆర్ద్రత ఈ గొంతులో వుండడం ఆశ్చర్యం కలిగించింది. "మను అయితే పాట పాడి జోకొట్టేవాడు. నేను లేపేశాసా - నా పాటతో" గిల్టీగా అన్నాడాయన. అలా అంటున్నప్పుడు చూసింది - ఆయన కుడిచేతి మధ్య వేలికి ముత్యపు టుంగరం. ఓసారి మనురాశాడు. అతనిది శ్రవణ నక్షత్రమనీ, ఆ నక్షత్రం వారు కుడిచేతి మధ్య వేలికి వెండితో చేయించిన ముత్యపు టుంగరం పెట్టుకుంటే మంచిదంటున్నారని. వెంటనే చేయించి పంపిందామె! ఆ ఉంగరం ఈయన వేలికి ఎలా వచ్చింది? ఎంత తాతయితే మాత్రం ఇదే మిటి? సరిగ్గా ఆలోచనలను పసిగడుతున్నట్టు అన్నాడాయన-"అది నువ్వు పంపిన ఉంగరమే. కూర్చో చెప్తాను." కూర్చుందామె. కూర్చోబోతున్నప్పుడు చూసింది - ముసలాయన ఎదురుగా డ్రాయింగ్ బోర్డ్ మీద తన బొమ్మ - వొళ్ళెరగకుండా నిద్రిస్తున్న తన బొమ్మ. అదో లా అయిపోయిందామె. "నీకో నిజం చెప్పాలి. నువ్వు ఎలా అనుకున్నా సరే" అన్నాడాయన. వరూధిని ఏమిటన్నట్టు చూసింది.

"నిన్ను రమ్మని తొందర చేసిందెందుకో తెల్సా - నీకు నిజం తెలియాలనే. నిన్ను మాయ చేయడమో, నీతో ఆటలాడ్డమో నా ఉద్దేశం కాదు. ప్రేమకర్థం అవతలి మనిషి నాశనం కోరుకావడం కాదు. అందుకే రమ్మన్నాను. గుండె దిటవు చేసుకో. మను నా మనవడు కాదు - నేనే!" ముందు అర్థం కాలేదు. ఆపైన నిజంగా షాక్ తిందామె. "జీవితంలో అన్నీ వుండి ఏమీ లేని నాకు... నేను జీవించి వుండాలంటే అడ్డూ అదుపూ లేని ప్రేమకావాలని అర్థమైంది. నా అభిరుచులు కలిసే అమ్మాయి నువ్వే అని నీ ఉత్తరాలు చెప్పాయి. అందుకే నేను బ్రతకడం కోసం నీలో ప్రేమను పెంచి పోషించాను. నిజానికీ హాల్లో నువ్వు చూస్తున్నవన్నీ నా ఫొటోలే - నా చిన్నప్పటివి. ప్రేమ లేకపోతే నేను బ్రతకలేను. అలా అని నాకు గానీ వుంటే నా మనవరాలి వయసు (నాకు ఉంటేగింటే) గలనిన్ను మోసగించలేను. మీ వాళ్ళు పెళ్ళికి తొందరపెడుతున్నారని రాశావు. నీకు నచ్చిన వాడ్ని పెళ్ళిచేసుకో. అప్పుడప్పుడు ఉత్తరాల్లో నాకింత ఆప్యాయతా భిక్ష పెడితే చాలు".

* * * * *

గతం ముగిసి వర్తమానంలో కొచ్చిన వరూధిని, సన్యాసి రావు మను ఇంటి కొచ్చారు. ఆమె కోసమే కళ్ళల్లో ప్రాణాలు నిలుపుకుని వున్నాడు మను. ప్రేమ గొప్పదనం అదే - డెబ్భయేళ్ళ పైబడ్డాయతనికి. అయినా కళ్ళలో జీవం, గొంతులో ఆర్ద్రత, గుండెలో మమత!

విస్తుబోయి నిలబడ్డాడు సన్యాసిరావు. "మను అంటే ఈ ముసలాడా!?" మనసులో ఆలోచన మాటగా బైట కొచ్చేసింది. పురుగును చూసినట్టు చూసింది వరూధిని అతన్ని. ఈ దేశంలో భావు కతలేని మగాళ్ళను, ముఖ్యంగా మొగుళ్ళను ఉరి తీయాలనుకుంది.

"వచ్చావు - నా కదే చాలు. నాకు ఎవరూ లేరు - నువ్వు తప్ప. ఈ తోట, ఇల్లు అన్నీ నీవే, పెయింటింగ్స్, పుస్తకాలు, కేసెట్స్, జాగ్రత్త. బ్రతకడం కాదు - జీవించడమంటే నాకు ఎంత ఇష్టమో తెలుసుగా! ఇక్కడ ఎప్పుడూ ప్రాణమున్నజీవం వుండేట్టు చూడు. నువ్వు నా ప్రాణ సఖివి కదా... నువ్వు వచ్చే వరకు.... నాకు నువ్వు కనిపించే వరకు.... నా కళ్ళల్లో నిన్ను పూర్తిగా నింపుకునేవరకు ప్రాణం నిలుపుకున్నాను-" కొడిగడుతున్న ప్రాణాన్ని నిలుపుకోడానికి ఆఖరి యత్నం చేసి విఫలుడయాడు మను. వరూధినికి దుఃఖం కట్టలు తెగి ప్రవహిస్తోంది. సన్యాసి రావు ఆమె భుజంపై చేయి వేశాడు ఓదార్పుగా! ❑

రాజ్యాంగం! ప్రతి వనితా తెలుసుకోవలసిన విషయాలు

* లింగబేధంతో పనిలేకుండా మన రాజ్యాంగం అన్నిటా అందరకీ సమానత్వ హక్కుని ప్రసాదిస్తూంది (ఆర్టికల్ 14)

* ఉద్యోగావకాశాల విషయంలో కూడా ఈ సమానత్వం వర్తింపచేస్తూంది. వివక్షతతో ఉద్యోగావకాశలని కాదనడం నేరం. (ఆర్టికల్ 16 (1) ఆర్టికల్ 16 (2)

* జాతి, మతం కులం, సెక్సు, పుట్టిన చోటు మూలంగా వివక్షతనిషేదింపబడింది. ఆర్టికల్ 15 (1)

* స్త్రీ పురుషులకి సమానంగా జీవనోపాధి హక్కు ప్రసాదింప బడింది. ఆర్టికల్ 39 (3)

* రాజ్యాంగంలో స్త్రీలకై కొన్ని అవకాశాలు ప్రత్యేకింపబడ్డాయి.ప్రత్యేకంగా ఆర్టికల్ 15 (3)

* ప్రతి భారత పౌరుడూ - స్త్రీ వ్యక్తిత్వాన్ని, గౌరవాల్ని కించ పరిచేఅలవాట్లని వదులుకోవలసి వుంది. ఆర్టికల్ 51 A (e)

* ప్రమాదకరమైన పరిస్థితులలోగాని, ప్రమాదకరమైన చోటగానిపనిచేయాలని ఏ స్త్రీనీ నిర్భందించకూడదు. అది నేరం. ఉదా : బొగ్గు గనుల వంటి చోట్ల. ఆర్టికల్ 39 (3)

- కె. రామలక్ష్మి